క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించనున్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99631 70177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు



కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గండ్లూరి వీరశివారెడ్డి

సింహాద్రిపురం : మండలంలోని నంద్యాలంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు ఎల్ఐసీ మహేశ్వర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. వీరికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బావమరిది, ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

కొండాపురం : మండలంలోని మురగంపల్లెలో శుక్రవారం గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టను వేద పడితులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల నాయకుడు చింతరాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్ రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ మధురెడ్డికి సన్మానం



వైఎస్ మధురెడ్డిని సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

పులివెందుల రూరల్ : తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి శుక్రవారం నుంచి తొండూరు మండలంలో ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వెళ్తున్న సందర్భంగా పులివెందులలోని ఆయన నివాసంలో బీవీఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్ అధినేత సుబ్బారెడ్డి, ఆయన సోదరులు చంద్రఓబులరెడ్డి, లక్ష్మిరెడ్డి, మధుసూదన్‌రెడ్డిలతో పాటు సర్పంచ్ రామసుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు గజమాలతో వైఎస్ మధురెడ్డిని సన్మానించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

చెన్నూరు : గ్రామీణ ప్రాంతాలలో అన్నదమ్ముల్లా కలసి మెలసి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ పార్థసారథి అన్నారు. కొక్కరాయపల్లెలోని ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ఏవైనా సమస్యలు ఉంటే మీ గ్రామానికి ఏఎస్ఐ ఆంజనేయులు, అలాగే హెడ్ కానిస్టేబుల్స్, వీఆర్వోలు అందుబాటులో ఉంటారని వారు మీ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. అనంతరం ఆయన గ్రామంలో పల్లెనిద్ర చేశారు.

9న బిషప్ పట్టాభిషేక మహోత్సవం

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లాకు చెందిన క్రైస్తవ ప్రముఖులు సగిలి ప్రకాష్ పట్టాభిషేక మహోత్సవం ఈ నెల 9న ఖమ్మంలోని దివ్య కారుణ్య బృహత్ దేవాలయం కరుణగిరి ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ తెలిపారు. ఆరోగ్యమాత చర్చిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం బిషప్‌గా సగిలి ప్రకాష్ వెళ్లిన విషయం తెలిసిందే అన్నారు.

9న ఖమ్మంలో జరిగే ఆయన పట్టాభిషేక మహోత్సవానికి ఫాదర్ ఎండీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో 8న సాయంత్రం కడప, చిత్తూరు, పోరుమామిళ్ల, బద్వేలు తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేశారని తెలిపారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం



పులివెందులలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



తొండూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ మధురెడ్డి



లింగాల : వికలాంగుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి



చక్రాయపేట : ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్ కొండారెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజలందరు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకునే బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్పలు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత గంగిరెడ్డి ఆసుపత్రి, శ్రీనివాసహాల్, మెయిన్ బజార్, తదితర ప్రాంతాల్లో వారు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలను భారీ మెజారీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చంద్రమౌళి, కౌన్సిలర్ సుజాత, లక్ష్మిభార్గవి, కాంతమ్మ, అంకాలమ్మస్వామి, ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, కిట్టు, రాజేష్, ఫక్రుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, భద్రంపల్లె, మధు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని కల్లూరుపల్లె, దిద్దుకుంటవాండ్లపల్లెల్లో శుక్రవారం మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యే అభ్యర్థి జగనన్న, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఓట్లు వేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తెలుగు దేశం, జనసేన, బీజేపీ పార్టీలకు ఓట్లేస్తే ప్రజలకు వచ్చే సంక్షేమ పథకాలను అన్నింటిని నిలిపి వేస్తారన్నారు. ఆకూటమి పని అంతా దోచుకోవడానికి సరిపోతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ సభాపతి నాయుడు, సర్పంచ్ పురుషోత్తం నాయక్, చలపతి నాయుడు, మండల ఉపాధ్యక్షుడు గఫూర్, జేసీఎస్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే జగనన్న ధ్యేయమని సీకేదిన్నె జెడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులురెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని ఓబులంపల్లి, బకరాపురం, రసూల్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వేయించి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో ఇంటికి వెళ్లి పింఛన్లను, ప్రభుత్వ పథకాలను అందిస్తున్న వలంటీర్ల వ్యవస్థను రద్దు చేసేందుకు చంద్రబాబునాయుడు చేసిన కుట్రలు అన్నీ ఇన్ని కాదన్నారు. తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో ప్రజలకు ఏ ఒక్క సంక్షేమ పథకం ఇంటి వద్దకు చేరదన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సీకేదిన్నె : ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : రాష్ట్రంలోని అన్నివర్గాలకు సమన్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే సాధ్యమని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బావమరిది, ఎన్నికల పరిశీలకులు గండ్లూరి వీరశివారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె, నంద్యాలంపల్లెలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ శ్రేణులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రతిపక్ష పార్టీలు పన్నుతున్న కుట్రలకు లొంగకుండా ప్రజల సంక్షేమానికి పాటుపడే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా, అలాగే ఎంపీగా అవినాష్‌రెడ్డిలను అఖండ మెజారీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, పవన్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, మనీరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నీలకంఠారెడ్డి, భూపాల్‌రెడ్డి, భగీరథరెడ్డి, సర్వేశ్‌రెడ్డి, రఘునాథరెడ్డి, అశోక్‌నాథ్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శివకోటి నారాయణరెడ్డి, ద్వారకనాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడమే కాక పేద, బడుగు, బలహీన వర్గాలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని లింగాల మండల ఇన్‌చార్జి వైఎస్ అభిషేక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుణకనపల్లెలో ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మండల వ్యాప్తంగా ఎన్నో ఎత్తిపోతల పథకాలు, తాగునీటి పతకాలను ఏర్పాటు చేసి ప్రజలకు తాగు, సాగునీరు కొరత లేకుండా చేశారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, మండల యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, గ్రామ నాయకులు శేఖర్‌రెడ్డి, మునేశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులు, మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కర్నా రమేష్‌కుమార్‌రెడ్డి, జిల్లా యూత్ కన్వీనర్ శివకుమార్‌రెడ్డి, లింగాల, సింగిల్‌విండో అధ్యక్షులు ఏవి శ్రీనివాసరెడ్డి, రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పులివెందులలోని తన స్వగృహం నుంచి దాదాపు 40 వాహనాలతో మండలంలోని మదూరు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి ర్యాలీగా వెళ్లారు. వైఎస్ మధురెడ్డి, మండల అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డిలు మదూరుకు చేరుకోగానే గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్లను అభ్యర్థిస్తూ రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్ అవినాష్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలంటూ ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయశంకర్, సర్పంచ్ గోపాల్, కోఆప్షన్ మెంబర్ ప్రకాష్‌రావు, స్థానిక నాయకులు శంకర్, కొండయ్య, నవమోహన్, రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, మండల పరిశీలకులు బండి రామమునిరెడ్డి, తాలూకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పండుగపై అపోహలు వద్దు

పులివెందుల : హిందూవులకు అతిముఖ్యమైన, ప్రధానమైన ఉగాది పండుగపై అపోహలు వద్దని పురోహితులు, పంచాంగ విశ్లేషకులు వేదపండితులు రామ్‌కుమార్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉగాది యుగ ఆది అనే వాఖ్యం నుంచి ఏర్పడిందన్నారు. తెలుగు సంవత్సరం ప్రారంభదినం దీనినే ఉగాది పండుగ అంటారు. సంవత్సరం ప్రారంభం రోజు కావున తలంటుస్నానం చేసి నూతనవస్త్రాలు ధరించి తమ ఇంటి దేవునికి నైవేద్యం సమర్పించి తదుపరి పంచాంగశ్రవణం ఈ సంవత్సరం ఎలా ఉంది అని పురోహితులను అడిగి తెలుసుకుంటారన్నారు. ఈ సంవత్సరం ఉగాది మంగళవారం వచ్చిందని, పండుగ ముందురోజు 8వ తేదీ సోమవారం సూర్యగ్రహణం ఉందని చాలా మందికి అపోహలు ఉన్నాయన్నారు. 8వ తేదీ సోమవారం సూర్యగ్రహణం లేదని, భారతదేశానికే కాకుండా ఏదేశంలో కూడా సూర్యగ్రహణం లేదని ఉగాది పండుగ, దీపావళి అమావాస్య పండుగలు ఏరోజు వచ్చినా ఆ రోజు తలంటుస్నానం ఆచరింపవచ్చునని, నూతన వస్త్రాలు ధరించవచ్చని, చైత్రశుద్ధపాడ్యమి ఏ రోజు వచ్చినా ఆ రోజు పండుగ ఆచరించదగిన దన్నారు. కావున ప్రజలు ఈనెల 9వ తేదీన ఉగాది పండుగ ఆచరించాలని ఆయన తెలియజేశారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ముస్లింలతో ప్రార్థనలు నిర్వహిస్తున్న గండ్లూరు వీరశివారెడ్డి

సింహాద్రిపురం : పవిత్ర రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని ఎంపీ వైఎస్ అవినారెడ్డి బావమరిది, ఎన్నికల పరిశీలకుడు గండ్లూరి వీరశివారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని వివేకానంద హైస్కూల్ ఆవరణలో గండ్లూరు వీరశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు మండలం వ్యాప్తంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి వారు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో వారే స్వయంగా ముస్లిం సోదరులకు వడ్డించారు. ఈ విందులో రామ్మోహన్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, అరవిందనాథరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కిషోర్ రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, హరినాథరెడ్డి, మైనార్టీ నాయకుడు జాఫర్, నజీర్, బషీర్, ఖాదర్ వలీ, మహమ్మద్ తదితర గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి



పులివెందులలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీనివాసహాల్, క్రిస్టియన్‌లైన్‌లలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, రాష్ట్ర సివిల్‌సప్లై డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిలు పాల్గొని బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. అలాగే ఆహారవిజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో కళాశాల డీన్ ఎంఎస్ బేగ్, అధ్యాపకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : సమాజంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం అహర్నిషలు కృషి చేసి అలుపెరుగని సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్ అని మహాజన రాష్ట్ర సమితి (ఎంఆర్ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు యామవరం చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం జగ్జీవన్ రామ్ 116 వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంఆర్ఎస్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్ఎస్ నాయకులు అబ్రహం, రాయప్ప, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రిజర్వేషన్లు

కొనసాగాలంటే జగనన్న రావాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న హజ్ కమిటీ సభ్యులు

జమ్మలమడుగు : రాష్ట్రంలో ముస్లింలకు రిజర్వేషన్లు కొనసాగాలంటే తిరిగి అధికారంలోనికి వైఎస్సార్‌సీపీ రావాలని హజ్ కమిటీ చైర్మన్ బద్వేలు గౌస్‌లాజం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మదీనా, నూర్ మసీదులలో ప్రార్థనల అనంతరం వచ్చిన వారికి ప్రభుత్వం ముస్లింలకు చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత నిరుపేదలకు మధ్యతరగతి ప్రలజలకు సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీలకు అసరాగా నిలవడంతోపాటు, రాజకీయంగా శాసనసభలో మైనార్టీలకు అవకాశం కల్పించిన ఏకైక నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక ముస్లింలను కలిసి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలంటూ విన్నవించారు. రాష్ట్రంలో హజ్ చేసే 3529 మంది యాత్రికులకు రూ.19.54 కోట్లు ఖర్చుచేశారన్నారు. ఆదేవిధంగా మసీదులో సేవలందించే ఇమాంలకు, మౌజన్‌లకు ప్రతినెల గౌరవ వేతం కింద రూ.346 కోట్లు ఖర్చు చేశారన్నారు. శాసనసభలో నలుగురు ఎమ్మెల్యేలు, శాసనమండలిలో నలుగురు సభ్యులు, మేయర్లుగా ఇద్దరిని, జడ్పీ వైస్ చైర్మన్‌గా ఒకరిని, మున్సిపల్ చైర్మన్లుగా 11 మందిని ఎంపీటీసీ, జడ్పీటీలలో పెద్ద సంఖ్యలో ముస్లిం మైనార్టీలకు అవకాశం కల్పించిన నాయకుడు జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో షామీర్ ఆలీ, దాదాపీర్ అన్సర్ పాల్గొన్నారు.

విధులను అంకితభావంతో నిర్వహించాలి



పదవి విరమణ పొందిన క్రిష్టఫర్‌ను సన్మానిస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : మైలవరం మండల విద్యాశాఖాధికారి క్రిష్టఫర్ విధులను అంకితభావంతో నిర్వహించేవారని జిల్లా ఉప విద్యాశాఖాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మార్చి 31వ తేదిన పదవీ విరమణ పొందిన క్రిష్టఫర్‌ను శుక్రవారం మండల ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మైలవరం మండల విద్యాశాఖాధికారి బత్తిని చిట్టిబాబు అధ్యక్షతన వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ మండలాల విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

పెన్షన్ ప్రతి లబ్ధిదారుడికి అందాలి

జమ్మలమడుగు : వికలాంగులకు, వితంతువులకు వృద్ధులకు అందించే పెన్షన్ ప్రతి ఒక్కరికి కచ్చితంగా అందాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వివిధ సచివాలయాలకు వెళ్లి పెన్షన్ పంపిణీలపై ఆరాతీశారు. ఆదేవిధంగా క్షేత్ర స్థాయిలో కాలువలను పరిశీలించారు. ప్రాంతాలలో ఎక్కువగా నీరు నిల్వలేకుండా చేయాలని దోమల నివారణ మందులు కొట్టాలంటూ పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలకు కావలసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

05జెయండి01 రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

నేడు మండల పూజ

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం బండ్లయ్యగారిపల్లె సమీపంలో వెలసిన శ్రీసిద్ధేశ్వర స్వామి ఆలయంలో శనివారం మండల పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అల్లపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమయ్యే ఈవేడుకకు మండలంలోని ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు.

13 గడ్డివాములు దగ్ధం



పోట్లదుర్తి గ్రామంలో దగ్ధమైన గడ్డి వాములు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో రైతులకు చెందిన 13 గడ్డి వాములు దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పోట్లదుర్తి గ్రామానికి చెందిన 9 మంది రైతులకు చెందిన గడ్డి వాములకు అగ్ని అంటుకుని 13 గడ్డి వాములు దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే గడ్డి వాములు పూర్తిగా కాలిపోయాయి. రూ.13 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

9న ఇంటాక్ ఉగాది వేడుకలు

కడప కల్చరల్: భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఈ నెల 9వ తేదీ ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో గల మానస ఇన్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైంది



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని ఫాతిమా వైద్య కళాశాల ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాష, కడప నగర మేయర్ సురేష్‌బాబు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని, ఈ మాసంలో ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు చేపట్టి పవిత్ర ఖురాన్ పఠనంతో అల్లాహ్‌ను ప్రసన్నం చేసుకుంటారన్నారు. ఇలాంటి పవిత్ర కార్యక్రమంలో తాము భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ముస్లిం సమాజానికి ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నామని వివరించారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాష మాట్లాడుతూ ఈ రంజాన్ మాసంలో ఎంతో కఠోరమైన ఉపవాస దీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ మాసం చివరి పదిరోజుల్లో షబ్బే ఖదర్ వస్తుందని, ఆరోజున పవిత్ర ఖురాన్ ఆవిర్భవించిందని తెలిపారు. ఈ రాత్రుల్లో జాగరణ చేస్తూ ఖురాన్ పఠిస్తూ అల్లాహ్ కృపకు దగ్గర కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారన్నారు. కళాశాల సెక్రటరీ జవ్వాద్ ఏక్యూ మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రతి ముస్లిం సర్వమానవాళికి ఎంతో పవిత్రమైందన్నారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం విశొడి జకాత్, పేదవారికి ఫిత్రా అందించి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతారన్నారు. ఇది మహా ప్రవక్త నుంచి వచ్చిన సంప్రదాయమన్నారు. అనంతరం భక్తులతో కలిసి అతిథులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. కళాశాల ఈడీ సల్మాన్ ముర్తజా, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శైలజ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ



ఓబుల్‌రెడ్డిపల్లెలో వైఎస్సార్‌సీపీలో చేరినవారితో సాయినాథ శర్మ

వీరపునాయునిపల్లె : మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వలసల వెల్లువ కొనసాగుతోంది. శుక్రవారం సాయినాథ్ శర్మ ఆధ్వర్యంలో ఆయన అనుచర వర్గం మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి సమక్ష్యంలో 50 కుటుంబాలు పార్టీలోకి చేరాయి. మద్రిపల్లెలో సుధాకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటక్రిష్టారెడ్డి, రామగంగిరెడ్డి మరో 15 కుటుంబాలు, ఓబుల్‌రెడ్డిపల్లెలో శ్రీరాములు, లక్షుమయ్య, బ్రహ్మయ్య, హరి, యల్లప్ప, నాగార్జున, బాలరాజు, హరిశంకర్‌లతో పాటు 25 కుటుంబాలు, వీరపునాయునిపల్లెలో 10 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సాయినాథ శర్మ, రఘునాథరెడ్డి పార్టీ కండువాలు వేసా ఆహ్వానించారు. అనంతరం సాయినాథ శర్మ మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో నీతికి నిజాయితీకి యుద్ధం జరగబోతోందని ఈ యుద్ధంలో మనమందరమూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అందుకు సైనికుల్లా పనిచేయాలని ఆయన వారిని కోరారు. పేద ప్రజలకు సేవచేయాలన్న ఒకే ఒక లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడికి అండగా నిలబడాలన్నారు. మన కుటుంబాన్ని ఎంత బాధ్యతగా చూసుకుంటామో జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు అంతకంటే ఎక్కువగా బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిని మూడవ సారి ఎమ్మెల్యేగా గెలిపించుకుని రికార్డును సృష్టించాలన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని గతంలో కంటే ఎక్కువ మెజారిటీతో గెలిపించాలన్నారు. రాష్ట్రం సర్వ నాశనం కాకుండా ఉండాలంటే చంద్రబాబు కూటమికి మనము తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవ యాదవ్, పాయసంపల్లె ఎంపీటీసీ రామాంజనేయరెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, నాయకులు శ్రీనివాసుల్‌రెడ్డి, ప్రతాప్ యాదవ్, సాంబశివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నమయ్యకు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవాకేంద్రంలో శ్రువారం పదకవితా పితామహుడు అన్నమయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందరర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య తన సంకీర్తనల ద్వారా తెలుగు సంగీతానికి, సాహిత్యానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. అన్నమయ్య సంకీర్తనల గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో హరికథా భాగవతార్ యడవల్లి రమణయ్య భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

మైదుకూరు: వేసవి ముగిసే వరకు నీటిని పొదుపుగా వాడుకుందామని మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్షాభావం వలన భూగర్భజలాలు అడుగంటడంతో నీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. ప్రజల అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడి సహకరించాలని కోరారు. మైదుకూరు ఎర్రచెరువుకు ఫిబ్రవరి 12న తెలుగుగంగ ఎస్ఆర్–2 నుంచి నీటిని వదిలామని, అయితే అన్ని చోట్ల నీటి సమస్య ఉండటంతో చింతకుంట, శెట్టివారిపల్లె, మిట్టమానుపల్లె చెరువులకు నీటిని మళ్లించారన్నారు. అందువల్ల మైదుకూరు చెరువు పూర్తి స్థాయిలో నీరు చేరుకోలేదని, దీంతో బోర్లలో నీటిమట్టం పెరగలేదని తెలిపారు. ముఖ్యంగా సాయినాథపురం ప్రాంతంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. తన ఇంటిలో ఉన్న బోరు నుంచి ప్రతి రోజు 40 ట్యాంకర్ల ద్వారా నీటి ఎద్దడి ఉన్న వార్డులకు నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఖాజీపేట మండలం ములపాకు బృహత్తర నీటి పథకం నుంచి నీరు అందించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, రెండు రోజుల్లో మైదుకూరుకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ములపాకు నీరు వస్తే నీటి సమస్యను అధిగమించవచ్చని తెలిపారు.

10న భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం

ఈనెల 10న తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకుంటానని చంద్ర ప్రకటించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని తెలిపారు. ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే తనను కోరితే తప్పకుండా చేస్తానని స్పష్టం చేశారు.